సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన గంగాధరరావుకు రూ. 2.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శనివారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో విమల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈఓగా సుధాకర్



ఆలయ ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న గుమ్మడిదల సుధాకర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా జీటీఎస్ టెంపుల్ ఈఓ గుమ్మడిదల సుధాకర్‌ను నియమిస్తూ దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సర్వేశ్వర్, రాజు, జగదీశ్వర్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠంలో సంగీత ఉత్సవం



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ శంకరమఠం ఆవరణలో శనివారం సంగీత ఉత్సవం ఘనంగా జరిగింది. త్యాగరాజ పంచరత్న శ్రీరామదాసు నవరత్న కీర్తనలు ఆలపించారు. అదే విధంగా సంగీత విద్యార్థులచే గాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. త్యాగరాజ భక్తి గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పుచ్చ రాజ్యలక్ష్మి, సాయి సుష్మ, డాక్టర్ ఎం. కిరణ్ చావలి తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు ఇవ్వాలంటూ దూషిస్తున్నాడని హత్య

జీడిమెట్ల: బాలానగర్ పీఎస్ పరిధిలో డిసెంబర్ 30న జరిగిన హత్య కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శనివారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ ఏసీపీ హన్మంతరావు, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. జగద్గిరిగుట్ట అంబేడ్కర్ నగర్‌కు చెందిన కృష్ణగౌడ్(39), గాజులరామారానికి చెందిన ఆకుల కృష్ణ(42), సనత్‌నగర్‌కు చెందిన మాదరబోయిన రవి(39), గుర్రం నరేష్(39), గంబు శంకర్‌గౌడ్(44)లు స్నేహితులు. వీరంతా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటారు. కృష్ణగౌడ్‌కు కృష్ణముదిరాజ్ కొంత డబ్బు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయంలో కృష్ణముదిరాజ్ ఎక్కడ కలిసినా కృష్ణగౌడ్ బూతులు తిట్టేవాడు. కృష్ణ ముదిరాజ్‌తో పాటు ప్రతిరోజు కృష్ణగౌడ్ అందరు స్నేహితులను నోటికి వచ్చిన పదజాలంతో తాగి తిడుతుండాడు. కృష్ణగౌడ్ బాధ భరించలేక మిగతా నలుగురు అతడిని హతమార్చాలనుకున్నారు.

ప్లాన్ చేసి హతమార్చారు..

జనవరి 29వ తేదీన కృష్ణగౌడ్‌తో పాటు మిగతా నలుగురు మొత్తం ఐదుగురు కలిసి ఆటోలో మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ గుడికి వెళ్లారు. అక్కడ ఐదుగురు కలిసి మద్యం తాగారు. అదేరోజు రాత్రి తిరిగి వస్తూ వారు వేసుకున్న ప్లాన్ ప్రకారం నలుగురు కలిసి కృష్ణగౌడ్‌ను ఆటోలోనే తీవ్రంగా కొట్టారు. దెబ్బలు తాళలేక పడిపోవడంతో బాలానగర్‌లోని కైటాన్ పరిశ్రమ ప్రాంతంలోని చెత్తకుప్పలో పడేశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి కైటాన్ పరిశ్రమ ప్రాంతంలో మృతిచెంది ఉన్నాడని బాలానగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతుడు ఆటోడ్రైవర్ కృష్ణగౌడ్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీలను పరిశీలించారు. హత్యకు పాల్పడింది కృష్ణముదిరాజ్, రవి, నరేష్, శంకర్‌గౌడ్‌లుగా గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. చేసిన నేరాన్ని అంగీకరించారు. నలుగురిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

శ్మశాన వాటికల్లో వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: శ్మశాన వాటికల్లో వివిధ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పర్వత్‌నగర్, రామారావునగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, యూసుఫ్ నగర్‌లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శ్మశాన వాటికల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ దీపాలు లేవన్నారు. శ్మశాన వాటికల్లో నీటి సదుపాయం కోసం బోరు వేయించాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. అదే విధంగా కాలనీల్లో మంచి నీటి సరఫరా సక్రమంగా లేదని స్థానికుల ఫిర్యాదుతో జలమండలి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, జలమండలి అధికారులు, శానిటేషన్ అధికారులు, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కో ఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జాహిద్ షరీఫ్ బాబా, జ్ఞానేశ్వర్, రాజు, బ్రహ్మ, సయ్యద్ రియాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మోతీనగర్: పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ వి రామారావు నగర్‌కు చెందిన సాంబశివ సతీమణి మృతి చెందింది. కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా సఫ్దార్ నగర్‌కు చెందిన షేక్ రఫీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే స్వామివారి ఊరేగింపు కార్యక్రమానికి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. సెవెన్‌హిల్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు జరుగనున్న సందర్భంగా నిజాంపేట రోడ్డు వద్ద చేపడుతున్న వరదనీటి కాలువ పనులను శనివారం పరిశీలించారు. ఊరేగింపునకు అడ్డు లేకుండా రోడ్డును త్వరగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ ఏఈ రాజీవ్, వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓ సత్యనారాయణ, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, ప్రశాంతినగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి 20వ వార్షిక ఆలయ బ్రహ్మోత్సవాలు 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 4న సాయంత్రం 6 గంటలకు పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్విక్ వరుణ, అంకురార్పణ, తీర్థప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

ఘనంగా ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతి



గద్దర్ జయంతిలో పాల్గొన్న దళిత, మైనార్టీ, బహుజన సంఘాల నాయకులు

మోతీనగర్: ఢిల్లీవాలా స్వీట్ హౌస్ చౌరస్తాలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర దళిత యువజన సంఘం అధ్యక్షులు సూర్య ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పీఆర్ శివకుమార్, వివిధ సంఘాల దళిత నాయకులు, మైనార్టీ నాయకులు, వినాయకరావు నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్, హిందూ శ్మశాన వాటిక అధ్యక్షులు నర్సింహులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తు ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శంషీగూడ వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకొని, అధికారి మీ ఇంటి వద్దకు వచ్చి సర్వే చేసి ఫొటో తీసుకుంటే సర్వే ముగిసినట్లు అవుతుందని, వారి తిరిగి మళ్లీ వార్డు కార్యాలయానికి వెళ్లవలసిన అవసరం లేదన్నారు. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ కనుక ప్రజలు సమన్వయం పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఆఫీస్ అడ్మిన్ శ్రీనివాస్, సీఓ ముస్తఫా, ఆపరేటర్ ప్రభావతి, బిల్ కలెక్టర్ కుమార్, నాయకుడు గుడ్ల శ్రీనివాస్, రాజు గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలి

కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 6వ ఫేజ్‌లోని పీవీ నరసింహారావు పార్కును శనివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కు కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలని ఏఈ సాయిప్రసాద్‌కు సూచించారు. కాలనీలో డ్రైనేజీ సమస్య, దోమల బెడద ఎక్కువగా ఉందని భగత్‌సింగ్ నగర్ ఫేజ్ 2 అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నారాయణ రాజు, ఎంఎస్‌రావు, జీఎంరావు, సాంబశివారెడ్డి, రవీందర్ రెడ్డి, ఈశ్వర్, హరిప్రసాద్, రామస్వామి, సూర్యప్రకాష్, రంగారావు, సోమేష్, బసవ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు అధికారుల నియామకం

కూకట్‌పల్లి: గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారంలోని 4 వార్డుల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కోసం ప్రభుత్వం అధికారులను నియమించింది. డిజిగ్నేటెడ్ ఆఫీసర్‌గా వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు నియమించబడ్డారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారి ఫిర్యాదులు కూడా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గాజులరామారం వార్డు కార్యాలయం ఎ నర్సింగ్ రావు, ఏఎంసీ, 8978904128, జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం కె. సునందిని, సూపరింటెండెంట్, 8008433878, చింతల్ వార్డు కార్యాలయం, కె. జవహర్ లాల్, సూపరిటెండెంట్, 9000994018, సూరారం వార్డు కార్యాలయం, ఎ. హరిబాబు, 9000994012 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు



చెరువులో ఆయిల్ బాల్స్ వేస్తున్న సూపర్ వైజర్ నరసింహులు, సిబ్బంది

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రగతినగర్, కూకట్‌పల్లి, ఆల్విన్ కాలనీ భీమునికుంట, ఆలితలాబ్ చెరువుల్లో శనివారం ఎంటమాలజీ సూపర్ వైజర్ నరసింహులు సిబ్బందితో కలిసి దోమల నివారణలో భాగంగా ఎంఎల్‌ఓ ఆయిల్ బాల్స్ వేశారు. చెరువులో, నాలాల్లో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు వేయవద్దన్నారు. మన వీధుల్లోకి వచ్చే చెత్తా చెదారాన్ని ఉదయం మన ఇళ్ల వద్దకు వచ్చే ఆటోలోనే వేయాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

బీజేపీలో చేరికలు

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు సీహెచ్. నర్సింగ్‌రావు, శ్రీలత బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీని మరింత పటిష్టం చేసి అధికారంలోకి వచ్చే విధంగా అందరం సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డాకయ్య, పిట్ల మనోహర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు నాగరాజు, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారిని సన్మానిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

నేడు రాణాప్రతాప్ నగర్ అధ్యక్ష పదవికి ఎన్నికలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాణాప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్ష పదవికి ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నారని ఆకుల వెంకటేష్ కు ఇల్లు గుర్తు, సీహెచ్. మాధవాచారికి దీపం గుర్తును కేటాయించామని తెలిపారు. మొత్తం 222 ఓట్లు ఉన్నాయన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ ఉంటుందని, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి వీఎస్‌కే మెమోరియల్ హైస్కూల్‌లో 2004–2005 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల డైరెక్టర్ స్వామికి ఘన స్వాగతం పలికి సన్మానించారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, జ్యోతి, సీత, సాయి అలేఖ్య, అరుణ, బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతరావు, వేణు, రమ, శ్యామల, వెంకటేశ్వర్లు, నరేందర్, రజియా, పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7 నుంచి వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 7న సాయంత్రం విగ్రహాల ఊరేగింపు, 8 నుంచి 10వ తేదీ వరకు త్రయాహ్నం దీక్షతో ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆలయంలో గణపతి, వాసవీ మాత, నగరేశ్వర స్వామి, నంది, శిఖర, ధ్వజ, సుబ్రహ్మణ్య దేవాలయ ప్రతిష్ఠాపనలు కూడా జరగనున్నాయని పేర్కొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కూకట్‌పల్లి: సింగూరు పూర్ణిమ పాండు అధ్యక్షతన శనివారం దయార్‌గూడలోని అంబేడ్కర్ పార్కులో రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ.. మన పిల్లల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం తన పిల్లలు చనిపోయినా అంబేడ్కర్‌ని చదివించిన గొప్ప మహనీయురాలని అన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద 127వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. ఈ సంవత్సరం రమాబాయి అంబేడ్కర్ అవార్డుకు బాపంపల్లి భారతి రామస్వామిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ సానుకూలమే..

నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్



కార్యక్రమానికి హాజరై డప్పు కొడుతున్న బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ సానుకూలంగానే ఉందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ నెల 7న నగరంలో జరుగనున్న లక్ష డప్పులు– కోటి గొంతుకలు కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని శనివారం మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ నిర్వహించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. వచ్చే శుక్రవారం జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మయ్య, రఘు, తూము సంతోష్, చున్ను పాషా, శివచౌదరి, అశోక్, నయీమ్, మోసిన్, సచిన్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న అశ్విని సుబ్బారావు తదితరులు

మూసాపేట: కూకట్‌పల్లిలోని హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇందిరా చంద్రశేఖర్ ఆడిటోరియంలో పేద విద్యార్థులకు శనివారం స్కాలర్‌షిప్‌లను భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అశ్విని సుబ్బారావు, వివేకానంద సేవా సమితి చైర్మన్ హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొని సుమారు 75 మంది విద్యార్థులకు రూ.7 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవదానం, జనరిక్ మెడికల్ స్టోర్, కిసాన్ వికాస్ పేరిట రైతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, అమర జవాన్ల కుటుంబాలకు ఆర్థిక సహాయం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు నరసింహ చారి, సృజన ప్రభ, పసుపులేటి నరేంద్ర కృష్ణ, బీఎస్ఎన్ మూర్తి, సీహెచ్ అనిల్ కుమార్, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగించ వద్దంటూ..

రాయదుర్గం: డ్రగ్స్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ శ్రీకృష్ణయూత్ ప్రచారానికి శ్రీకారం చుట్టింది. శనివారం ఐటీకారిడార్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, మాదాపూర్ వరకు బైక్ ర్యాలీని నిర్వహిస్తూ ఆయా కూడళ్ళలో పోస్టర్ల ప్రదర్శన చేశారు. అంతకుముందు మాదాపూర్ డీసీపీ వినీత్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరింపచేశారు. శ్రీకృష్ణయూత్ చొరవను ఆయన అభినందించారు. అనంతరం బయోడైవర్సిటీ కూడలి, దాబా కూడలి, రాయదుర్గం, మైండ్ స్పేస్, హైటెక్‌సిటీ, శిల్పారామం కూడళ్ల వద్ద డ్రగ్స్ వినియోగం వద్దంటూ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, నాయకులు రోహిత్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, సంగమేష్, దేవేందర్, సందీప్,గోపాల్, ఏయిజాజ్,బాబు, సంతోష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.